గణేష్ మహరాజ్ కీ జై..


ఖాజీపేట: ఆంజనేయకొట్టాలు చెరువులో ...


గోపవరం: రాచాయిపేటలో...

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలుప్రాంతాలలో కొలవుదీరిన బొజ్జగణపయ్యలను కొందరు ఉత్సవ కమిటీల వారు సోమవారం నిమజ్జనానికి తరలించారు. ఉదయం విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజించారు. మధ్యాహ్నం కొందరు కమిటీల వారు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. అనంతరం బొజ్జగణపయ్య విగ్రహాలను ట్రాక్టర్లలోకి ఎక్కించి డప్పువాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య రంగులు చల్లుకుంటూ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉట్టి కొట్టు కార్యక్రమం, డప్పువాయిద్యాలకు నృత్యం చేస్తూ ఆనందంగా గడిపారు. దారి వెంబడి భక్తులు నీళ్లు చల్లి, కాయాకర్పూరాలను నైవేద్యంగా సమర్పించి మంగళహారతులు ఇచ్చారు. పెన్నానదీ, చాపాడు సమీపంలోని కాలువ, కామనూరు వద్ద ఉన్న కుందూనదిలో విగ్రహాలను ఇక సెలవంటూ వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. కొందరు ఉత్సవ కమిటీలవారు 5, 7 రోజులు పూజలు చేసి లంబోదరున్ని నిమజ్జనానికి తరలించనున్నారు.

వైభవంగా నిమజ్జనం

రాజుపాళెం : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండలంలోని అర్కటవేముల, పర్లపాడు, కొర్రపాడు, తొండలదిన్నె, గోపల్లె తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను వైభవంగా నిమజ్జనం చేశారు. జమ్ములమడుగు, వేపరాల, మోరగుడి, ఉలవపల్లె తదితర గ్రామాల నుంచి బొజ్జ గణపయ్యలను మండలంలోని వెల్లాల హైలెవెల్ కుందూ నది వద్ద నిమజ్జనం చేశారు. ఎంపీడీఓ షాకీర్‌ఆలీఖాన్, ఎస్ఐ వెంకటరమణ, వీఆర్‌ఓ రాజశేఖరరెడ్డి, సచివాలయం కార్యదర్శులు దస్తగిరిరెడ్డి, నాగార్జున, మహిళా పోలీసు షాహిదా, పోలీసులు, ఫైర్ సిబ్బంది నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో జనాలను నిమజ్జనం వద్దకు రాకుండా పోలీసులు అదుపు చేస్తున్నారు. 54 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

విద్యుత్ దీపాల నడుమ నిమజ్జనం

చాపాడు : మండలంలోని సీతారామాపురం వద్ద గల కుందూ నది వద్ద సోమవారం రాత్రి 9 గంటల వరకు నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి సమయంలో నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తకుండా రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్న పెద్దయ్యలు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. నిమజ్జనం వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించారు.

దువ్వూరులో..

దువ్వూరు : వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలో మూడు రోజుల పాటు పూజలందుకున్న వినాయక విగ్రహాలను సోమవారం వైభవంగా నిమజ్జనం చేశారు. ఇడమడక, కానగూడూరు, దువ్వూరు గ్రామాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలను కేసీ కెనాల్‌లో, వెంకుపల్లె, ఏకోపల్లె, పెద్దజొన్నవరం, జిల్లెల్ల, నేలటూరు గ్రామాల వారు కుందూ నదిలో, చల్లబసాయపల్లె, మదిరేపల్లె, చిన్నసింగనపల్లె, మనేరాంపల్లె, గుడిపాడు గ్రామాల్లోని వినాయక విగ్రహాలను చల్లబసాయపల్లె వద్ద ఉన్న ఎస్ఆర్–1 డ్యాంలో నిమజ్జనం చేశారు. మండలంలో 116 గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేయగా 92 విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేశారు. మండలంలోని చింతకుంట గ్రామంలో వినాయక విగ్రహం వద్ద ఉన్న లడ్డూను వేలం వేయగా లోమడ వీరనారాయణరెడ్డి రూ.1.58లక్షలకు లడ్డూరు దక్కించుకున్నారు. ఎస్ఐ వినోద్ కుమార్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


చాపాడు : నిమజ్జనం వద్ద పర్యవేక్షిస్తున్న పోలీసులు

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం


ఖాజీపేట : దుంపలగట్టులో లడ్డూ దక్కించుకున్న డాక్టర్ అరుణ్‌కుమార్‌రెడ్డి, రెడ్యం కుటుంబ సభ్యులు

ఖాజీపేట : మండలంలో వినాయకుని నిమజ్జనం కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. పండుగ పురస్కరించుకుని వినాయకుని లడ్డూ వేలం పాటలో దుంపలగట్టు గ్రామంలో డాక్టర్ మల్లెల అరుణ్‌కుమార్‌రెడ్డి ర. 72 వేలకు, లక్ష్మి దండను రెడ్యం శ్రీకాంత్‌రెడ్డి రూ.43 వేలకు, వెండి గిన్నెను రెడ్యం సునీల్‌కుమార్‌రెడ్డి రూ.27వేలకు వేలంలో దక్కించుకున్నారు. మిడుతూరులో ఇట్టెం శ్రీరాముల యాదవ్ రూ. 32 వేలు, కొత్త ఏటూరులో లడ్డూను మూలె మునికుమార్‌రెడ్డి రూ. 66 వేలకు, లక్ష్మి అమ్మవారి ప్రతిమను ఏనుగు శివారెడ్డి రూ.15 వేలకు దక్కించుకున్నారు. వినాయక పండుగ పురస్కరించుకుని దుంపలగట్టు గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


రాజుపాళెం : కుందూ నదిలో ..

జై జై గణేషా..

వినాయక చవితి పండుగ పురస్కరించుకుని మూడు రోజుల పాటు భక్తుల చే పూజలు అందుకున్న వినాయకుడు అత్యంత వైభవంగా నిమజ్జనం అయ్యాడు. ఖాజీపేట మండలంలో 121 విగ్రహాలను ఏర్పాటు చేయగా 8వ తేదిన 13 విగ్రహాలు నిమజ్జనం చేశారు. మూడవ రోజు 9వ తేదిన అత్యధికంగా 90 విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు. 11వ తేదిన 10 అలాగే 12న ఒకటి 15వ తేదిన ఒకటి విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు.

అట్టహాసంగా గణేశ్ ప్రతిమల నిమజ్జనం

పోరుమామిళ్ల : పట్టణంలోని గణేశ్ విగ్రహాలలో చాలా వరకు సోమవారం పట్టణ శివారులోని మల్లకతువలో నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనలలో కొలువుదీర్చి బ్యాండు మేళాలు, కోలాట ప్రదర్శనలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగించారు. గణపతి బప్పా మోరియా అంటూ యువత నినాదాలు చేస్తూ నిమజ్జన వేడుకలో పాల్గొన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అపశ్రుతికి తావు లేకుండా పోలీసులు, అధికారులు మూడు రోజులుగా కృషి చేస్తున్నారు. బందోబస్తు నడుమ విగ్రహాలను నిమజ్జనానికి తీసుకొచ్చారు. క్రేన్‌తోనే విగ్రహాలను మల్లకతువ మడుగులోకి వదిలారు.

నిమజ్జనానికి తరలిన గణపయ్యలు

బద్వేలు అర్బన్ : పట్టణంలో జై బోలో గణేష్ మహరాజ్‌కి అంటూ వైభవంగా గణపయ్యలను నిమజ్జనానికి తరలించారు. పట్టణంలో, రూరల్ పరిధిలో ఏర్పాటు చేసిన సుమారు 127 వినాయక విగ్రహాలలో దాదాపు 106 విగ్రహాలను మూడవరోజు అయిన సోమవారం మేళతాళాల నడుమ నిమజ్జనం అయ్యాయి. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లూరురోడ్డులోని సుమో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్, రాధాకృష్ణనగర్, శివానగర్, అబ్బరాతివీధి, ఆంజనేయనగర్, రాజుగారివీధి, కోటవీధి, అశోక్‌నగర్, కొండారెడ్డివీధి, రెడ్డెయ్యమఠంవీధి, విద్యానగర్ తదితర ప్రాంతాల్లోని విగ్రహాలతో పాటు మరికొన్ని వీధులలోని విగ్రహాలను అంగరంగ వైభవంగా యువకుల కేరింతలు, బాణసంచా పేలుళ్లు, తప్పెట్ల మోతల మధ్య నిమజ్జనానికి బయలుదేరాయి. కొన్ని చోట్ల విగ్రహాల ముందు ఏర్పాటు చేసిన చెక్కభజన ప్రజలను ఆకట్టుకున్నాయి.


పోరుమామిళ్ల: క్రేన్ సహాయంతో నిమజ్జన ప్రక్రియను చేస్తున్న అధికారులు

56 విగ్రహాల నిమజ్జనం

అట్లూరు : వినాయకచవితి సందర్భంగా నెలకొల్పిన 56 విగ్రహాలను సోమవారం నిమజ్జనానికి తరలించారు. మండల వ్యాప్తంగా 68 వినాయక విగ్రహాలను నెలకొల్పి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మూడవ రోజు అయిన సోమవారం 56 విగ్రహాలను ఆయా గ్రామాలలోని ప్రజలు గ్రామోత్సవాలు నిర్వహించి రంగులు చల్లుకుంటూ సిద్దవటం దగ్గర పెన్నానదిలో నిమజ్జన ఘట్టాన్ని పూర్తి చేశారు.

కోలాహలంగా గణనాథుని నిమజ్జనం

గోపవరం : గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులను సోమవారం కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. అన్ని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాయిద్యాల మధ్య బాణసంచా పేల్చుతూ ఉత్సవ కమిటీ సభ్యులతోపాటు అన్ని వర్గాల ప్రజలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సోమశిల ప్రాజెక్టు వెనుకజలాలు, సగిలేరులలో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బద్వేలు రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని రాచాయపేటలో గణనాథుని లడ్డూను అదే గ్రామానికి చెందిన వీరపరెడ్డి శివప్రియ రూ.16,100లును వేలంలో దక్కించుకుంది.

కాశినాయన : మండలంలోని వరికుంట్ల, ఆకులనారాయణపల్లె, బసనపల్లె, ఆనంవారిపల్లె, కోడిగుడ్లపాడు, చిన్నాయపల్లె, గంగనపల్లెతో పాటు పలు గ్రామాల్లో సోమవారం వినాయకుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గణనాథుని లడ్డు, చెరకుగడలు, వెలక్కాయలను వేలంపాట వేశారు. యువత రంగులు చల్లుకుంటూ డప్పువాయిద్యాలతో చిందులు వేస్తూ నిమజ్జనాన్ని నిర్వహించారు. మండలంలో 35 వినాయక విగ్రహాలలో 25 విగ్రహాలను నిమజ్జనం చేశారు. మిగిలిన విగ్రహాలు బుధవారం నిమజ్జనానికి వెళతాయి.

నిమజ్జనానికి తరలివెళ్లిన గణనాథులు

బి.కోడూరు : మండలంలో సుమారు 28 గణనాథుని విగ్రహాలు సోమవారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. వినాయకచవితిని అన్ని గ్రామాల్లో ఘనంగా యువత జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. మండలంలోని అక్కుపాలెం గ్రామంలో లడ్డూ వేలంపాట రూ.1.50 లక్షలకు కె.గంగాధర్ దక్కించుకున్నారు. రామసముద్రం గ్రామంలో ఉమ్మడిశెట్టిసింగరయ్య రూ.1.10 లక్షలకు వేలంపాటలో వినాయక లడ్డును దక్కించుకోగా, అంకనగొడుగునూరు గ్రామంలో వెలుగోటిపద్మనాభరెడ్డి రూ.1.10 లక్షలకు వేలంపాటలో లడ్డూను దక్కించుకున్నారు.

కలసపాడు : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం గణేశ నిమజ్జనం ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. యువకులు నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ ఉల్లాసభరితంగా గ్రామవీధుల్లో వినాయకుని విగ్రహాలను ఊరేగించారు. కొన్ని గ్రామాల్లో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా వినాయకుని వద్ద పెట్టిన లడ్డూను వేలంపాటలో అధికంగా పాడి దక్కించుకున్నారు. మూడవ రోజు కొన్ని గ్రామాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. కలసపాడు, సిద్దమూర్తిపల్లె, పెండ్లిమర్రి, ఎగువరామాపురం గ్రామాల్లోని వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు.


ప్రొద్దుటూరు కల్చరల్ : ఉట్టికొడుతున్న చిన్నారి


ప్రొద్దుటూరు కల్చరల్ : ఊరేగింపులో భక్తులు


దువ్వూరు : నిమజ్జనానికి బయల్దేరిన గణనాథులు


దువ్వూరు : కేసీ కెనాల్‌లో ..


నిమజ్జనం కోసం వెలుతున్న వినాయకుడు


కాశినాయన: వరికుంట్లలో ..


అట్లూరు: కొండూరు గ్రామంలో..


బద్వేలు అర్బన్: రాధాకృష్ణనగర్‌లో..


పోరుమామిళ్ల: గణనాథుడి గ్రామోత్సవంలో భక్తులు


కలసపాడు: పెండ్లిమర్రిలో కోలాటం వేస్తున్న దృశ్యం

నిమజ్జనం ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రత



ప్రొద్దుటూరు క్రైం : కుందూ వంతెన వద్ద వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు


ప్రొద్దుటూరు క్రైం : కుందూ వంతెన వద ప్రొద్దుటూరు డీఎస్పీతో చర్చిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

- కామనూరు బ్రిడ్జి వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనం ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ప్రొద్దుటూరు మండలంలోని కామనూరు కుందూ వంతెన వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాన్ని సోమవారం ఎస్పీ పరిశీలించారు. నిమజ్జనం చేయడానికి వచ్చే వాహనాల్లో నలుగురు మాత్రమే కమిటి సభ్యులు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు ఎస్పీ సూచించారు. చీకటి పడక ముందే విగ్రహాలు నిమజ్జనం జరిగేలా చూడాలన్నారు. వంతెనపైకి చిన్న పిల్లలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాధ్యమైనంత వరకు నిమజ్జన వాహనాల్లో చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు వెళ్లకుండా చూడాలన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పోలీసుల భద్రత ఏర్పాటు చేశారు. అలాగే కామనూరు వంతెన వద్ద కామనూరు పీహెచ్‌సీ డాక్టర్ హనీఫ్‌బాబా ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, సిబ్బందిచే మెడికల్ క్యాంపు పెట్టారు. ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్లతో పాటు అగ్నిమాపక రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేశారు. ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ భక్తవత్సలం, రూరల్ సీఐ బాలమద్దిలేటి బందోబస్తును పర్యవేక్షించారు. ఎస్ఐ మహమ్మద్‌రఫి ఆధ్వర్యంలో నిమజ్జనం ప్రాంతాల్లో భద్రత ఏర్పాటు చేశారు. నిమజ్జనం ముగిసిన తర్వాత నక్కలదిన్నె కుందూ పాత వంతెన మీదుగా వాహనాలు వెళ్లేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకున్నారు. నిర్దేంచిన ప్రాంతాల్లోనే గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయాలని సీఐ బాలమద్దిలేటి సూచించారు.


ప్రొద్దుటూరు క్రైం : కామనూరు వద్ద ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీఓ

కుందూనదిలో ఘనంగా గణేష్ నిమజ్జనం

- పోలీసులు, అధికారుల పర్యవేక్షణ
- ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు

చాపాడు : మండలంలోని సీతారామాపురం, అన్నవరం గ్రామాల సమీపంలోని కుందూనది వద్ద సోమవారం కోలాహలంగా గణనాథుని నిమజ్జన కార్యక్రమం జరిగింది. కుందూనదిలో వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తుండటంతో నిమజ్జన సమయంలో ఎలాంటి అపశృతి చోటు చేసుకోకుండా రూరల్ సీఐ శివశంకర్ పర్యవేక్షణలో నది పొడవునా ఇనుప భారీకేడ్లను ఏర్పాటు చేసి నిమజ్జనం చేసేందుకు వీలుగా పలు చోట్ల పాయింట్లను పెట్టారు. ప్రొద్దుటూరు, మైదుకూరు ప్రాంతాల నుంచి వివిధ వాహనాలలో తీసుకువచ్చే వినాయక విగ్రహాలను ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా వన్ వే రాకపోకలు జరిపారు. కుందూనది వద్ద ప్రత్యేక పూజలు చేస్తూ బైబై గణేశా అంటూ భక్తులు వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు.


చాపాడు : సీతారామాపురం కుందూనది వద్ద నిమజ్జనం కోసం బారులు తీరిన విగ్రహాలు


చాపాడు : సీతారామాపురం వద్ద సందడిగా నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడు

నిమజ్జనం వద్ద ప్రత్యేక వైద్య శిబిరం

మండలంలోని సీతారామాపురం, అన్నవరం గ్రామాల దగ్గర గల కుందూనది వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గణనాథుని నిమజ్జనం చేసేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అనారోగ్య, ఇతర ప్రమాదాలు చోటు చేసుకున్నా వైద్యం అయించేందుకు అన్నవరం వద్ద వైద్యాధికారి రాజేష్‌కుమార్, సీతారామాపురం వైద్యాధికారి కావ్య మాధురి పర్యవేక్షణలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చాపాడు : కుందూనదిలో గణనాథుని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

- పబ్లిసిటీ మీద ఉన్న శ్రద్ధ బాబుకు ప్రజలపై లేదు
- ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే విజయవాడ వరదలు
- చంద్రబాబు స్వార్థ రాజకీయాలకు సామాన్యులు బలి
- బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ



బద్వేలు అర్బన్ : కృష్ణానది వరదలతో విజయవాడ ప్రజలు పడిన ఇబ్బందులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వైఫల్యమే కారణమని సోమవారం బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ విమర్శించారు. స్థానిక ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రకృతి వైపరిత్యాల సమయంలో వరదలు వచ్చే అవకాశాలను వాతావరణ శాఖ ముందుగా ప్రభుత్వానికి హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం అలసత్వం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వాతావరణ శాఖ ఇచ్చిన హెచ్చరికలపై సమీక్షలు చేసి అధికారులను అప్రమత్తం చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉన్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరించి విజయవాడ శివారు ప్రాంత ప్రజలను నీట ముంచారన్నారు. ఈ ఉపద్రవానికి కారణం కేవలం సీఎం చంద్రబాబు నాయుడు, ఎన్డీయే కూటమి ప్రభుత్వ ముందుచూపు లేనితనమేనని చెప్పారు. స్వార్థ రాజకీయాలు తప్ప పేద ప్రజలు వారి రక్షణ పట్ల ఆలోచించే మనస్తత్వం చంద్రబాబుది కాదని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి సుమారు 50 మంది ప్రజలు ప్రాణాలను పోగొట్టుకున్నారంటేనే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో అధికారులు, ప్రజప్రతినిధులు మూడు రోజులైన వెళ్లలేని పరిస్థితి ఉందంటే ఆ ప్రాంత ప్రజలు ఎంత దారుణమైన పరిస్థితి ఎదుర్కొన్నారో తెలుస్తోందన్నారు. ప్రస్తుతం వరద ప్రభావిత ప్రాంతాల్లో నీరు తగ్గుతున్నప్పటికీ వరద సాయాన్ని పూర్తి స్థాయిలో అందించలేకపోయామని సీఎం చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రజలు ఆకలితో అలమటిస్తున్న, చిన్న పిల్లలు పాల కోసం పడుతున్న నరకయాతనలు ఈ ప్రభుత్వానికి కనబడకపోవటం దౌర్భాగ్యమన్నారు. చంద్రబాబుకు పబ్లిసిటీ పైన ఉన్న శ్రద్ధ పేదలను ఆదుకోవడంలో ప్రభుత్వం చూపించివుంటే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదన్నారు. తనను విజనరీ అని చెప్పుకునే చంద్రబాబు, వరద ప్రభావిత ప్రజలను అప్రమత్తం చేయడంలో.. ఆదుకోవడంలో విజనరీ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. కరకట్ట మీద ఉన్న ముఖ్యమంత్రి నివాసాన్ని, వేమూరి రాధాకృష్ణాకు చెందిన యాక్టివ్ పవర్ ప్లాంట్‌లు నీట మునగకుండా ఉండేందుకు సామాన్య ప్రజలను బలితీసుకోవడాన్ని ఎమ్మెల్యే తప్పుబట్టారు. ఇప్పటికైనా వరద ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలకు నిత్యావసర సరకులతోపాటు వారి ఎదురైన నష్టాన్ని పూర్తిగా ప్రభుత్వం చెల్లించాలంటూ డిమాండ్ చేశారు.

పూజలందుకోవయ్యా... గణపయ్యా..


ప్రొద్దుటూరు కల్చరల్ : కాగితంతో రూపొందించిన గణనాథుని విగ్రహం


ప్రొద్దుటూరు కల్చరల్ : బొల్లవరంలోని మహర్షి వీధిలో బొజ్జ గణపయ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథులకు సోమవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. భక్తిగీతాలు, ముగ్గుల పోటీలు, నృత్యప్రదర్శన, అంత్యాక్షరి తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక శ్రీరాములపేటలో కాగితంతో చేసిన బొజ్జగణపయ్య విగ్రహం ఆకట్టుకుంటోంది. గణనాథుని పేర్లు, గాయత్రి మంత్రం ఉన్న పేపర్లు 30 కిలోల కాగితాలతో ఈ విగ్రహాన్ని రూపొందించారు. కాగా పూజలందుకుంటున్న గణనాథులను ఐదు, ఏడు రోజుల్లో కమిటీల వారు నిమజ్జనం చేయనున్నారు.

దివ్యాంగులకు కృత్రిమ పరికరాల క్యాంప్

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 26, 27 తేదీల్లో దివ్యాంగులకు కృత్రిమ పరికరాల క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ కన్వీనర్ అఫ్జల్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు ప్రతి దివ్యాంగుడు యూడీఐడీ కార్డు కలిగి ఉండాలని, ఈ కార్డు లేకపోతే మీ పరిధిలోని నెట్ సెంటర్‌కు వెళ్లి కార్డు చేయించుకోవాలని సూచించారు. వికలత్వం 80 శాతం పైన ఉంటే నీలం రంగు, 80 శాతం కంటే తక్కువ ఉంటే పసుపు రంగు యూడీఐడీ కార్డులు ఇస్తారన్నారు. మెడికల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్, ఫొటోతో నెట్ సెంటర్‌కు తీసుకెళ్లి యూడీఐడీ కార్డు ఎన్‌రోల్ చేయించుకోవాలని తెలిపారు. యూడీఐడీ కార్డు ఎన్‌రోల్ చేయించుకోకుండా దరఖాస్తులు స్వీకరించరని, తప్పక చేయించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ నాయకులు ఖాజామొయిద్దీన్, రషీద్, మహేష్‌కుమార్, అంజి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు వితరణ

కాశినాయన : మండలంలోని వివేకానంద ఫౌండేషన్ నిర్వాహకులు పి.రామకృష్ణారెడ్డి నాయునిపల్లె గ్రామానికి చెందిన రవి, రత్నమ్మ అనే నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులను వితరణగా అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జీవితంపై అవగాహన లేకపోవడం వలన 5 మంది సంతాన్ని కన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని దయనీయ స్థితి వారిది. ఈ విషయాన్ని స్థానిక ఆశా కార్యకర్త తమ దృష్టికి తీసుకురావడంతో కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, బట్టలు, దుప్పట్లు అందజేశామన్నారు. భవిష్యత్తులో వారి పిల్లల చదువుకు భరోసాగా ఉంటామని హామీ ఇచ్చారు. రామకృష్ణారెడ్డికి ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోస్టర్ల విడుదల

ప్రొద్దుటూరు : జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా ఈనెల 10న నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్దేశ్వర రావు తెలిపారు. సోమవారం కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల, వికసిత ఫౌండేషన్, స్టార్ ఫౌండేషన్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ, మానవ హారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ జి.హుస్సేన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, డీఎస్పీ భక్తవత్సలం హాజరవుతారన్నారు.

ఎగ్జిబిషన్ వేలం వాయిదా

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో దసరా ఉత్సవాల సందర్భంగా ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో 45 రోజుల పాటు ఎగ్జిబిషన్ నిర్వహించుటకు ఈనెల 10న నిర్వహించాల్సిన టెండర్–కం–బహిరంగ వేలాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో టెండర్–కం–బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.